వివేకానంద స్ఫూర్తి యాత్ర



యాత్రలో పాల్గొన్న విశ్వ మానవతా సంస్థ ప్రతినిధి శ్రీనివాస చౌదరి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: విశ్వ మానవతా సంస్థ ప్రతినిధి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వివేకానంద స్ఫూర్తి యాత్ర ప్రారంభించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఖైరతాబాద్, నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్, దోమలగూడ, నాంపల్లి వరకు ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు మొక్కలు పెంచటం, ప్రకృతిని కాపాడటం, ప్లాస్టిక్ నిర్మూలించటం, సంస్కారవంతమైన విద్య గురించి అవగాహన కల్పించారు. యువజన దినోత్సవం నాటికి గ్రామ గ్రామానికి వివేకానంద చైతన్య స్ఫూర్తిని నింపే లక్ష్యంతో ఈ సైకిల్ యాత్ర సాగుతుందన్నారు. విశ్వ మానవతా సంస్థ, ఇతర సేవా సంస్థలు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఐక్యంగా నిర్వహించే యాత్ర పలు ప్రాంతాల్లో విద్యార్థులకు స్ఫూర్తి సమావేశాలు, సందేశాలు ఇస్తూ ముందుకు సాగింది.

'ఎస్కీ'లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కోల్‌కతా బృందం



రాయదుర్గం: 'ఎస్కీ' క్యాంపస్‌ను ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కోల్‌కతా అధికారులు బుధవారం సందర్శించారు. 'ఎస్కీ' డైరెక్టర్ రామేశ్వరరావుతో సమావేశమయ్యారు, అనంతరం క్యాంపస్‌లోని ఎస్‌పీజీఎస్ కళాశాల ఏర్పాటు, నిర్వహించే కోర్సులు, ఎస్కీలో ఏడాది పొడవునా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కాలేజ్ ప్రాంగణంలో 3 నెలల్లో నిర్మించిన సెంచరీ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు అంతర్జాతీయ సమావేశాలు జరిగాయని డైరెక్టర్ రామేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చీఫ్ లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, రాజారావు, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్కీ, ఎస్‌పీజీఎస్ కళాశాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అయ్యప్పసొసైటీలో అగ్నిప్రమాదం

మాదాపూర్: ఇన్వర్టర్, బ్యాటరీలు కాలిపోయిన ఘటనలో భవనంలో మంటలు రేగాయి. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ వైఎస్ఆర్ కూడలిలో ఉన్న ఓ భవనంలోని ఐదో అంతస్తులో బుధవారం నిపున్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ కంపెనీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం సెలవురోజు కావడంతో ఎవరూ లేరు. తాళం వేసిఉన్న కార్యాలయం నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇన్వర్టర్, బ్యాటరీలు కాలిపోవడం వల్ల ప్రమాదం జరిగిందని మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ మహ్మద్ ఫైజల్ తెలిపారు. పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నారు.

లారీకి మంటలు అంటుకొని ప్రమాదం!

జీడిమెట్ల: ప్రమాదవశాత్తు లారీకి మంటలంటుకొని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ వివరాల ప్రకారం.. డెక్కన్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ జీడిమెట్ల నుంచి సామగ్రితో విజయవాడ వెళ్లేందుకు బయలుదేరింది. జీడిమెట్ల ఫేజ్3లోని వాటర్ సప్లయి కార్యాలయం వద్ద ప్రమాదవశాత్తు లారీకి మంటలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ లారీని వదిలేసి పరారయ్యాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు. లారీలో ఉన్న సామగ్రి సగం వరకు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నందకిశోరుని కనవే..

మాదాపూర్: నూతన సంవత్సరం సందర్భంగా శిల్పారామం కిటికిటలాడింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య దర్శకులు కళారత్న కేవి. సత్యనారాయణ శిష్యబృందం అమెరికాకు చెందిన చదలవాడ శ్రీలహ్యాందవి, చదలవాడ శ్రీదవరాలి ,లోహిత చలసాని, అక్షర, వర్షశృతి, శివాత్మిక, జ్యోతిలు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. శ్రీ గణపతిని సేవించరాదే, నంద కిశోరుడు, సత్య శ్రీకృష్ణ ప్రణయ గాథ, మోహిని భస్మాసుర నృత్యరూకపం సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే సంధ్యారాజు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

చిత్తారమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరం

- జాతర విజయవంతానికి వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం
- ఆలయానికి 50 సంవత్సరాల చరిత్ర
- పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు
- 17 నుంచి 25 వరకు వేడుకలు



చిత్తారమ్మ జాతరకు తరలివచ్చిన జనసందోహం(ఫైల్)



సుభాష్‌నగర్: గాజులరామారంలో వెలిసిన చిత్తారమ్మ దేవి జాతరకు ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 17 నుంచి 25 వరకు జరుగనున్న అమ్మవారి జాతరకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, కార్యదర్శి బాలరాజు ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందించారు. ఆలయం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంవత్సరం చిత్తారమ్మ దేవి జాతర స్వర్ణోత్సవాలు మహా ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 17న జరుగనున్న ప్రధాన జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

పెరగనున్న భక్తుల సంఖ్య

చిత్తారమ్మ దేవి ఆలయం స్థాపించి 50 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఆ మేరకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. నగరంలోనే కాకుండా ఇతర జిల్లాలలో కూడా అమ్మవారి జాతర పోస్టర్లను పెద్ద ఎత్తున అతికించి ప్రచారం చేశారు. ఈ సంవత్సరం భక్తులు గతంలో కంటే అధిక సంఖ్యలో రానున్నట్లు ఆలయ కమిటీ అంచనా వేస్తోంది. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలీస్ భద్రత, వైద్యం, మంచినీరు, పరిశుభ్రత, ట్రాఫిక్, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నారు.



జాతర విశేషాలు

ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే చిత్తారమ్మదేవి జాతర 25 వరకు కొనసాగనుంది. 17న గణపతి పూజ, పుణ్యా వచనం, పంచగవ్య ప్రాసన, అగ్ని ప్రతిష్ట, 18న గవ్యాంత పూజలు, మూల మంత్ర జపం, చండీ హోమం , గాజులరామారం గ్రామం నుంచి ఆలయం వరకు పూలఘటం ఊరేగింపు. 19న ప్రధాన జాతర ఉదయం 3 గంటలకు అమ్మవారికి అభిషేకం, 4 గంటలకు విజయ దర్శనం, తలంబ్రాలతో ఒడి బియ్యం, అమ్మవారి పూజలు, బోనాలు, సాయంత్రం గాజులరామారం గ్రామం నుంచి పోతరాజుల విన్యాసాల మధ్య చిత్తారమ్మ దేవి ఊరేగింపు, 20న రంగం దివ్యవాణి, 21, 22, 23, 24 తేదీల్లో కుంకుమార్చన, 25న అన్నదానంతో జాతర ముగియనుంది.

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

హెచ్ఎండీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యప్రసాద్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న హెచ్ఎండీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్య ప్రసాద్

దుండిగల్: సీసీ రోడ్డు నిర్మాణ పనులను హెచ్ఎండీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ గ్రామం నుంచి గౌడవెల్లి వరకు రూ.5.5 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డుతో పాటు కల్వర్టు పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కావలి గణేశ్, నేతలు బండారి మహేశ్, అమరం ముత్యంరెడ్డి, జక్కుల మల్లేశ్ యాదవ్, దొంతి మహేశ్. బండారి బీరప్ప, యశ్వంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు వినతి



బీజేపీ నాయకులతో ఎంపీ ఈటల రాజేందర్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పుడున్న హాల్ సరిపోవడం లేదని, వాటిపైనా మరో 2 ఫ్లోర్లు వేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించారని, ఎంపీ ఫండ్ నుంచి రూ.10 లక్షలు కేటాయించి కమిటీ హాల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే డివిజన్‌కు చెందిన బీజేపీ ముఖ్య నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, జిల్లా స్పోక్‌పర్సన్ సురేష్ రెడ్డి, పరశురాం, జగద్గిరినగర్ బస్తీ అధ్యక్షులు జగన్, మురళీగౌడ్, రమేష్ యాదవ్, వసుంధర, రమేష్, గోపాల్, ముత్యాలు, లక్ష్మణ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రాని క్యాష్ కౌంటర్

మరమ్మతులు పూర్తైనా పట్టించుకోని అధికారులు



మరమ్మతులు చేపట్టిన క్యాష్ కౌంటర్ భవనం

చింతల్: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా తయారైంది కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ అధికారులు పనితీరు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలో ఉన్న బిల్లులు చెల్లింపు కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఐదు నెలల క్రితం రూ.2 లక్షల నిధులతో మరమ్మతులు చేపట్టారు. అయితే సదరు భవన మరమ్మతులు పూర్తయినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తేవడం లేదు. జలమండలి డివిజన్ కార్యాలయ ఆవరణలో ఒక జనరల్ మేనేజర్, రెండు సబ్ డివిజన్ల డీజీఎంలు, ఐదు సెక్షన్ల మేనేజర్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క అధికారి కూడా క్యాష్ కౌంటర్ విషయమే పట్టించుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది. పాత భవనం శిథిలావస్థకు చేరి మరమ్మతులు చేపడుతున్న క్రమంలో బిల్లులు చెల్లించేందుకు ఓ సెక్షన్ కార్యాలయంలో పనులు కొనసాగుతున్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవనం పూర్తయి ఐదు నెలలు గడిచిన క్యాష్ కౌంటర్‌ను పాత భవనంలోకి మార్చక పోవడం విమర్శలకు తావిస్తోంది. బిల్లులు చెల్లించేందుకు వచ్చే వినియోగదారులు క్యాష్ కౌంటర్ మూతపడిందన్న ఉద్దేశంతో కొంతమంది వెనక్కి వెళ్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త ఏడాది ప్రారంభంలోనైనా క్యాష్ కౌంటర్ ను ప్రారంభిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

అనాథలు, అభాగ్యులకు రగ్గుల పంపిణీ

మోతీనగర్: అనాథలను, అభాగ్యులను ఆదుకోవడంలోనే తృప్తి లభిస్తుందని ధరిత్రి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై చలికి వణుకుతూ నిద్రిస్తున్న ఎందరో అనాథలు, అభాగ్యులకు రగ్గులు, దుప్పట్లు, పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. బోరబండ, మోతీనగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట, ఖైరతాబాద్, నాంపల్లి, బాలానగర్, మూసాపేట, కూకట్‌పల్లితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో అందజేశారు. కార్యక్రమంలో నరసింహ, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, కేతన్, వైష్ణవి, రాధాకృష్ణ, సురేష్, ఆంజనేయులు, రాంచందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. షాపూర్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని ఆయనతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్‌యాదవ్, డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వైద్యనాథ్‌కు సేవా పతకం

మూసాపేట: పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పతకాలను ప్రకటించింది. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం. వైద్యనాథ్‌కు సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 35 సంవత్సరాలుగా కానిస్టేబుల్ స్థాయి నుంచి సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సేవా పతకం ప్రకటించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. త్వరలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు.

న్యూఇయర్ వేడుకలు.. పోలీసుల బందోబస్తు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్



నిజాంపేట్ : న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మరోవైపు పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరానికి యువత, మహిళలు, చిన్నారులు ఘన స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేయడంతో పాటు టపాసులు పేలుస్తూ యువత సందడి చేశారు. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలంతా న్యూ ఇయర్ జోష్‌లో మునిగిపోగా.. పోలీసులు మాత్రం తమ విధుల్లో నిమగ్నమయ్యారు. సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 31 రాత్రి నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లో ఎక్కడికక్కడే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి మందు బాబులు రోడ్లపై తిరగకుండా చర్యలు చేపట్టారు. అలాగే జనవరి 1న దేవాలయాలు, ప్రార్థన మందిరాల వద్ద బందోబస్తు చేపట్టారు.

59 మంది పట్టుపడ్డారు..

సుభాష్‌నగర్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన 59 మంది పట్టు బడ్డారు. జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 45 మంది సిబ్బందితో రాత్రి 2.30 వరకు విధులు నిర్వహించారు. షాపూర్‌నగర్, గండిమైసమ్మలలో డ్రంకెన్ డ్రైవ్ ఏర్పాటు చేశారు. వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఐదు చోట్ల భారీ గేట్లు ఏర్పాటు చేశారు. దుండిగల్, మల్లంపేట్ వద్ద అవుటర్ రింగ్ రోడ్డు పైకి గూడ్స్, ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనాలనే అనుమతించామని తెలిపారు. పట్టుబడిన వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.



ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



31న రాత్రి రోడ్లపై పోలీసులు బందోబస్తు

జేఎన్‌టీయూహెచ్ జేఏసీ కేలండర్ ఆవిష్కరణ



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ రాష్ట్ర, యూనివర్సిటీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేసి కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇండోర్ స్టేడియం వద్ద మొక్కలు నాటి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ డాక్టర్ భిక్షపతి, వైస్ చైర్మన్ తేజ, ప్రెసిడెంట్ సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాస్యం విక్రాంత్, జేఎన్‌టీయూ అధ్యక్షులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



సూరారం ఉమామహేశ్వర ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ

- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికిన ప్రజలు
- ఆలయాల్లో పూజలు



క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న సంక్షేమ సంఘాల నాయకులు

కుత్బుల్లాపూర్: నూతన సంవత్సర వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బుధవారం పలు మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు, కేక్ కటింగ్‌లు చేశారు. అదే విధంగా పలు అనాథాశ్రమాలు, దివ్యాంగుల ఆశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను ఆయా పార్టీల శ్రేణులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరానికి బై బై అంటూ.. 2025కు ఘన స్వాగతం పలికారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు.



సీఎంని కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్



అంబేడ్కర్‌నగర్‌లోని బేతనీయ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



హెచ్ఎంటీ కాలనీలో పండ్లు పంపిణీ చేస్తున్న మసూద్



కుత్బుల్లాపూర్ బేతెల్ చర్చిలో జరిగిన వేడుకలో ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు



కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు